సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

హింసలేని సమాజం కావాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హింసలేని సమాజాన్ని నిర్మించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. నవంబర్ 25 హింసా వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబర్ పది మానవ హక్కుల దినోత్సవం వరకు ఐద్వా ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం నల్లగొండ, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వారు పాల్గొని మాట్లాడారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కెఎల్ఎన్ మహిళా జూనియర్ కళాశాలలో జరిగిన సెమినార్ మల్లు లక్ష్మి పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఎక్కడో ఒకచోట మహిళపై దాడులు, లైంగికదాడులు, దౌర్జన్యాలు, వేధింపులు నిత్యకృత్యమయ్యాయన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు అని రంగాల్లోనూ రాణిస్తున్నప్పటికీ ఇంకా వివక్ష కొనసాగుతోందని విమర్శించారు. వావివరుసలు మరిచి మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రధానంగా డ్రగ్స్, మద్యం విచ్చలవిడిగా దొరుకుతూ ఉండటంతో మహిళలపై అగాయిత్యాలు పెరుగుతున్నాయని చెప్పారు. బీహార్, అసోం, రాజస్థాన్, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాల్లో గృహహింస రోజురోజుకూ పెచ్చురిల్లిపోతుందని ఆరోపించారు. సింగపూర్ మాదిరిగానే డ్రగ్స్, మద్య నిషేధం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హింస లేని సమాజ నిర్మాణం కోసం పాలకులు పాటుపడాలని కోరారు. ప్రవచనాల పేరిట కొందరు మహిళపై అనుచితవ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వారిని టీవీలో చర్చలు పెట్టేందుకు నిషేధించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగికదాడులను నిరసిస్తూ బలమైన ఉద్యమాలు చేయాలని, అవసరమైతే తిరగబడాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు పోలబోయిన వరలక్ష్మి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గాదె పద్మమ్మ, కళాశాల కరస్పాండెంట్ హనుమంతరెడ్డి, ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు సునీత, మాలతి, వసంత తదితరులు పాల్గొన్నారు. జోగులంబ గద్వాల జిల్లా గద్వాల కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్లో నిర్వహించిన సెమినార్‌లో అరుణజ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింస అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయన్నారు. స్త్రీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా హింస ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో పదోవ తరగతి చదువుతున్న బాలికపై జరిగిన లైంగికదాడి ఘటన, వనపర్తిలో స్కూల్‌కి వెళ్తున్న చిన్నారిపై దారుణం, హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినిపై ప్రొఫెసర్ లైంగిక దాడికి పాల్పడటం లాంటి ఘటనలు బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసలేని సమాజ స్థాపనకు పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, జిల్లా నాయకురాలు, హస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్యాపిటల్యాండ్ భారీపెట్టుబడులు

- రూ.6,200 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు
- మానవ భవిష్యత్తు డేటానే : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం ఐటి రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. తాజాగా క్యాపిటల్యాండ్ ఐటి కారిడార్‌లో రూ.6,200 కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చింది. వచ్చే ఐదేళ్లలో వివిధ విభాగాల కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో క్యాపిటాల్యాండ్ మంగళవారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్, ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, క్యాపిటల్యాండ్ ఇండియా ట్రస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజీవ్ దాస్ గుప్తా, రియల్ అసెట్స్ సిఇఒ పాట్రిక్ బూకాక్ పాల్గొన్నారు. రూ.6200 కోట్లతో హైదరాబాద్‌లో ఒక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడ ఆ సంస్థ తన కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు ప్రకటించింది. రూ.1,200 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ మాదాపూర్‌లోని సిఎల్ఐఎన్‌టి ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంది. 2,50,000 చదరపు అడుగుల విస్తీర్ణం, 36 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగి ఉండే ఈ ఐటిపిహెచ్ డేటా సెంటర్‌ను ఐదు సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో తమకున్న సుమారు 60 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ విస్తీర్ణాన్ని రెట్టింపు చేసేందుకు రానున్న ఐదు సంవత్సరాలలో మరో రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఆ కంపెనీ పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. "భారతదేశంలో వేగంగా అభివద్ధి చెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌లలో హైదరాబాద్ ఒకటి. మానవ భవిష్యత్తును మరింత మెరుగుపర చడంలో డేటానే కీలక పాత్ర పోషించబోతుంది. రాష్ట్రంలో క్యాపిటల్యాండ్ పెట్టుబడులు పెడుతున్నందుకు సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో రోజురోజుకు డెవలప్ అవుతున్న ఐటి పరిశ్రమ అవసరాలు ఈ డేటా సెంటర్‌తో తీరుతాయి. అదే విధంగా ఇతర ఐటి, ఐటి అనుబంధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విషయంలోనూ క్యాపిటల్యాండ్‌తో కలిసి తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుంది." అని కెటిఆర్ పేర్కొన్నారు. ఆసియా,యూరప్‌లో ఉన్న 25 డేటా సెంటర్‌లతో గత కొన్ని సంవత్సరాలుగా డేటా సెంటర్ డిజైన్, అభివద్ధి, నిర్వహణలో తాము మిగతా వారి కంటే ఎంతో ముందున్నామని క్యాపిటల్ ల్యాండ్ ప్రయివేటు ఈక్విటీ ఆల్టర్నేటివ్ అసెట్స్, రియల్ అసెట్స్ సిఇఒ పాట్రిక్ బూకాక్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనుకున్న తమ ప్రణాళికలో భాగంగా క్యాపిటాల్యాండ్ ఇండియా ట్రస్ట్‌తో కలిసి ఇండియాలో రెండవ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉంటుందన్నారు. డేటా రంగంలో ఇండియాలో నెంబర్ వన్‌గా నిలవాలన్న తమ ఆకాంక్షలకు అనుగుణంగా హైదరాబాద్ సెంటర్ ఉంటుదన్నారు.

కెటిఆర్‌కు ఒప్పంద పత్రం అందజేస్తున్న క్యాపిటల్యాండ్ ఇండియా ట్రస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజీవ్

నేటి నుంచి పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభ

- తొలిరోజు ప్రదర్శన, బహిరంగసభ
- ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షులు నర్సయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) 22వ రాష్ట్ర మహాసభ బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో జరగనుంది. హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఈ మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో దుర్భర పరిస్థితులున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము మాట్లాడుతూ తొలిరోజు (బుధవారం) విఎస్‌టి నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు విద్యార్థుల ప్రదర్శన ఉంటుందన్నారు.

బాబ్రీ మసీదు కూల్చివేత తీవ్రమైన న్యాయ ఉల్లంఘన

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాబ్రీ మసీదు కూల్చివేత తీవ్రమైన న్యాయ ఉల్లంఘనని, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై దాడి అని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత దినంను నిరసిస్తూ ఆవాజ్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకిక, ప్రజాస్వామ్య విలువల పునాదులపై నిర్మితమైన దేశాన్ని హైజాక్ చేసి మతోన్మాదం, విద్వేషం పునాదులపై నిర్మించాలని సంఘ్ పరివార్ కలలు కంటోందన్నారు. అసత్యాలు, కట్టుకథలు ఆధారం చేసుకొని విషప్రచారం చేసి బాబ్రీ మసీదును కూల్చి వేశారని ఆరోపించారు. అధికారం కోసం మతాన్ని అడ్డుపెట్టుకుని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఇలాంటి దాడులకు పాల్పడుతున్నదని తెలిపారు. ప్రజలు ఏమైనా బిజెపికి అవసరం లేదని, అధికారం సంపాదించడమే దాని అంతిమ లక్ష్యంగా ఉందన్నారు. దీనిని లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కార్పొరేట్, మతోన్మాద శక్తుల మైత్రి బంధం కొనసాగుతోందని. ప్రజా సంపద, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడున్నారని విమర్శించారు. అభివృద్ధి నిరోధక పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. సంఘ్ పరివార్ ప్రోద్బలంతో మైనారిటీలు, దళితులు, మహిళలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను, బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల్ని ఖండించాలని ప్రజలను కోరారు. దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, కాపాడుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆవాజ్ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ సత్తార్, నగర నాయకులు మహమ్మద్ కలీం, గఫార్ ఖాన్, మహ్మద్ రఫీ, మొహమ్మద్ సాజిద్, షేర్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

వికలాంగుల సంక్షేమ కమిషనర్ శైలజ

కమిషనరేట్‌లో విద్యార్థుల సమక్షంలో చర్చలు

మాట తప్పితే ఆందోళన తప్పదు - ముత్తినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంధ విద్యార్థుల సమస్యలను నెలలోగా పరిష్కరిస్తామని వికలాంగుల సంక్షేమ కమిషనర్ శైలజ హామీ ఇచ్చారు. 'మా సమస్యలు పరిష్కరించాలి.. హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి.. అధికారుల వేధింపులు ఆపాలి'.. తదితర నినాదాలతో అంధ విద్యార్థులు మంగళవారం వికలాంగుల కమిషనరేటు ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జెఎసి, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మెన్ ముత్తినేని వీరయ్య సమక్షంలో కమిషనర్ శైలజ, కార్పొరేషన్ చైర్మెన్ వాసుదేవరెడ్డి చర్చలు జరిపారు. అంధ విద్యార్థుల నాలుగు ప్రభుత్వ హాస్టళ్లలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన చేస్తున్నామని అధికారులకు తెలిపారు. హాస్టళ్లలో కనీస వసతులు లేవని వివరించారు. అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. భోజనం మాని ఉపవాసంలో ఉన్నా.. పట్టించుకోరా? అని ప్రశ్నించారు. విద్యార్థినుల హాస్టళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు మిగతా వసతి గృహాల్లో ఉన్న సమస్యలనూ నెల రోజుల్లో పరిష్కారం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

జనవరి 18 నుంచి రెండో విడుత 'కంటి వెలుగు'

- కంటి పరీక్షలు చేసి, ఉచితంగా అద్దాల పంపిణీ
- పంచాయతీ, మున్సిపల్ శాఖలతో సమన్వయంతో ముందుకు
- జిల్లా కలెక్టర్లతో మంత్రి హరీశ్‌రావు వీడియోకాన్ఫరెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి 18వ తేదీ నుంచి ప్రారంభించనున్న రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కంటి వెలుగు కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల్లోని అధికారులు ఉత్సాహంగా పాల్గొనాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని చెప్పారు. మొదటి విడత కంటి వెలుగు ఎనిమిది నెలలు జరిగిందని, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం వంద పనిదినాల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం మొదటి సారి 827 బృందాలు పని చేస్తే, ఇప్పుడు 1500 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందులో 30 లక్షల రీడింగ్ గ్లాసెస్, 25 లక్షల ప్రిస్క్రిషన్ గ్లాసెస్ ఉంటాయని, కార్యక్రమం ప్రారంభానికి ముందుగానే అవసరమైన అద్దాలు ఆయా జిల్లాలోకి పంపిణీ చేయడం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు చేసిన నెల రోజుల్లో ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ. 200 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రోజు వారీ వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్, పంచాయితీరాజ్ అధికారులతో చర్చించి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్లాన్ చేసుకోవాలన్నారు. మండల, జిల్లా, పురపాలక సంఘం మీటింగ్‌లలో కంటి వెలుగుపై చర్చించి ప్రజా ప్రతినిధులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేత, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిఐటియులోకి చేరిన టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర నాయకురాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్‌కెవి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి తిరిగి సిఐటియులో చేరారు. వరంగల్ జిల్లా సిఐటియు మహాసభ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి రమ, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు సమక్షంలో మంగళవారం మాధవికి సిఐటియు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మిగతా వారికీ సిఐటియు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం కాసు మాధవి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పట్టించుకునేది సిఐటియు మాత్రమేనని, సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడుతోందని, అందుకే కార్మికుల పక్షాన పోరాడే సిఐటియులో తిరిగి చేరుతున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ అనేక భ్రమలు, ఆశలతో కొందరు సిఐటియును వీడి టిఆర్ఎస్‌కెవిలో చేరారని, వారి ఆశలు, భ్రమలు తొలగి తిరిగి సొంత గూటికే చేరడం శుభ పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఆల్ యూనివర్సిటీ యూనియన్ నాయకులు మెట్టు రవి, వరంగల్ జిల్లా సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు మాలోత్ సాగర్, ముక్కెర రామస్వామి, సహాయ కార్యదర్శి అనంతగిరి రవి, సింగారపు బాబు, ఇనుముల శ్రీను, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులను ఆదుకోవాలి

- కోర్టు తీర్పు ఇచ్చినా ఇళ్ల స్థలాలు ఇవ్వట్లే..!
- పాత్రికేయుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టు వృత్తి గౌరవ ప్రదమైనా.. సమాజానికి వారు చేస్తున్న సేవలు గొప్పవైనా.. పాత్రికేయులు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ అధ్యక్షతన చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత లేదన్నారు. 90 శాతానికి పైగా జర్నలిస్టులు పేద, దిగువ మధ్యతరగతికి చెందినవారే అయినందున.. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను తమ పార్టీ రాష్ట్ర నాయకత్వం సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. జనవరిలో జర్నలిస్టుల సమస్యలపై మరింత ఉధృతంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంఖ్య తక్కువే కదా.. వారి సమస్యను పక్కకు పెట్టాలనే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తే జనవరి నుంచి మిగిలిన కార్మికుల మాదిరిగానే జర్నలిస్టుల తరపున సిపిఎం ఉధృతంగా ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియుడబ్ల్యుజె (ఐజెయు)), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు (టిజెఎఫ్), తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ (టివిజెఎ), తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టిజెఎ)తో పాటు విద్యావంతుల వేదిక మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేష్, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ నవీన్‌రెడ్డి, భూక్యా శ్రీనివాస్, యర్రా శ్రీనివాస్, వివిధ జర్నలిస్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల సౌందర్యాన్ని రెట్టింపు చేసేవి చీరలు

- గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతీయ సంస్కృతి, మహిళల సౌందర్యాన్ని రెట్టింపు చేసేవి చీరలేనని గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. తనకు చీరంటే ఎంతో ఇష్టమని, ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపించినపుడు షాపింగ్ చేసి చీరలు కొంటానని తెలిపారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ గవర్నమెంట్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ వెడ్డింగ్ స్పెషల్ సిల్క్ ఎగ్జిబిషన్‌ను గవర్నర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను కెనడాలో ఉన్నత విద్యాభ్యాసం చదువుతున్నప్పుడు చీరలు ధరించానని, అక్కడి ఓ మెడికల్ ఆఫీసర్ చూసి.. ఆరడుగులున్నా ఎటువంటి కుట్టు లేకుండా చీరను బాగా ధరించారని మెచ్చుకున్నారని గుర్తు చేసుకున్నారు. శీతాకాల విడిది కోసం ఈ నెల చివరివారంలో వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఇక్కడి నుంచే చీరను తీసుకెళ్లి ఇవ్వనున్నట్టు చెప్పారు. చేనేతకారులను ప్రోత్సహిస్తున్న మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమార్‌ను ప్రశంసించారు. అలాగే కోవిడ్‌తో పాటు ప్రజలతో మమేకమైన ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు డిస్కౌంట్ అందించాలని కోరగా, నిర్వాహకులు 20 శాతం ఇస్తామని చెప్పడంతో ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ సిఇఒ వినయ్ కుమార్, శ్రీనివాసరావును, అలాగే చేనేతరంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు చేనేతకారులను ఈ సందర్భంగా గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఈ ప్రదర్శన ఈ నెల పది వరకూ కొనసాగనుంది. కార్యక్రమంలో సోషలైట్ శైలజారెడ్డి, హాండ్లూమ్ క్యురేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE. KURNOOL
I.A. No.289/2022 in I.A. No.163/2018 in O.S.No. 178/2004

P. B. Subbamma died by LRs
P. Raju and Another. ...Petitioners
-Vs-
P. Chandra Sekhar died by LRs
P. Jayaramappa died by LRs
P. Surendra and others. ...Respondents

NOTICE TO R 10

P.Sreeramulu S/o Late Jayaramappa,
Flat no. 206, Sai Paradise, Jaya Nagar Colony,
Kukatpally, Hyderabad.

సదరు ఫైనల్ డిక్రి పిటీషన్‌లో R2 అయిన జయరామప్ప గారు మరణించినందున, నీవు ఆయన కుమారుడవై నందున పై అర్జీలో నిన్ను కనపరచి L.R గా చేర్చవలసినందున పై అర్జీదార్లు ఈ L.R అర్జీదాఖలు చేసినారు. పై విషయములో రెస్పాండెంటు నెం.10 అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 20-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 20-12-2022

A. Sivaramaiah,
N.Venkata Rao,
Advocate for Petitioners

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE. KURNOOL
I.A. No.288/2022 in I.A. No.163/2018 in O.S.No. 178/2004

P. B. Subbamma died by LRs
P. Raju and Another. ...Petitioners
-Vs-
P. Chandra Sekhar died by LRs
P. Jayaramappa died by LRs
P. Surendra and others. ...Respondents

NOTICE TO R 10

P.Sreeramulu S/o Late Jayaramappa,
Flat no. 206, Sai Paradise, Jaya Nagar Colony,
Kukatpally, Hyderabad.

సదరు ఫైనల్ డిక్రిలో R2 అయిన జయరామప్ప గారు మరణించినందున ఆయనకు వారసులుగా మిమ్ములను అర్జీలో సకాలంలో చేర్చనందున సదరు అర్జీని కోర్టు వారు అబేట్ చేసినందున & అబేట్‌మెంటు రద్దు పరచ గోరి పై అర్జీదారులు ఈ అర్జీదాఖలు చేసియున్నారు. కనుక ఈ విషయములో రెస్పాండెంటు నెం.10 అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 20-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడ ఓమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 20-12-2022

A. Sivaramaiah,
N.Venkata Rao,
Advocate for Petitioners

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE. KURNOOL
I.A. No.287/2022 in I.A. No.163/2018 in O.S.No. 178/2004

P. B. Subbamma died by LRs
P. Raju and Another. ...Petitioners
-Vs-
P. Chandra Sekhar died by LRs
P. Jayaramappa died by LRs
P. Surendra and others. ...Respondents

NOTICE TO R 10

P.Sreeramulu S/o Late Jayaramappa,
Flat no. 206, Sai Paradise, Jaya Nagar Colony,
Kukatpally, Hyderabad.

సదరు ఫైనల్ డిక్రి అర్జీలో R2 అయిన జయరామప్ప గారు మరణించినందున వారి వారసులను ఇందులో చేర్చుటకు ఎల్. ఆర్ పిటీషన్ (L.R Petition) దాఖలు చేయుటలో జరిగిన 1920 రోజులు ఆలస్యమును మన్నించకోరుచూ అర్జీదారులు పై అర్జీదాఖలు చేసియున్నారు. కనుక ఈ విషయములో రెస్పాండెంటు నెం.10 అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 20-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 20-12-2022

A. Sivaramaiah,
N.Venkata Rao,
Advocate for Petitioners

సివిల్స్ మెయిన్స్‌లో ఎస్‌సి స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ : మంత్రి కొప్పుల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలో తెలంగాణ ఎస్‌సి స్టడీ సర్కిల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఇంటర్వ్యూకు అర్హత పొందారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎస్‌సి స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది సివిల్స్ పరీక్షకు హాజరైన 16 మందిలో ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్వ్యూకు ఎంపికైన వారిలో వరంగల్ జిల్లా ములుగుకు చెందిన డి.ప్రవీణ్ (హాల్ టికెట్ నెంబర్ 1035114), జనగామకు చెందిన కె.ప్రణయ్ కుమార్ (హాల్ టికెట్ నెంబర్ 1002593), నిజామాబాద్‌కు చెందిన డి.కిరణ్ కుమార్ (హాల్ టికెట్ నెంబర్ 1014566) ఉన్నారు. వీరు వచ్చే నెలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కానున్నారు. సివిల్స్ మెయిన్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులను రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందించారు. ఇంటర్వ్యూలోనూ ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

11న సిబిఐ ముందుకు కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సిబిఐ ఈ నెల 11న విచారించనుంది. ఆ రోజు ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలోనే విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నట్లు సిబిఐ ఢిల్లీ కార్యాలయం హెడ్ రాఘవేంద్ర వత్స మంగళవారం కవితకు మెయిల్ ద్వారా సమాచారం పంపారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 6న విచారణకు హాజరుకావాలని సిబిఐ కవితకు నోటీసులు జారీచేసింది. అందుకు కవిత కూడా సమ్మతి తెలిపింది. అయితే, ఆ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదని, ఈ నెల 6న విచారణకు హాజరుకాలేనని.. 11, 12, 14, 15 తేదీల్లో ఏదో ఒక రోజున హైదరాబాద్ రావాలని సిబిఐకు కవిత సమాచారం ఇచ్చింది. అందుకు స్పందించిన సిబిఐ ఈనెల 11న ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కవితను కోరింది.

అంధకారంలో దళిత, గిరిజన కుటుంబాలు

- మీటర్లు లేవని, బకాయిలు వేలల్లో ఉన్నాయని..
- ఎస్‌సి కాలనీ, తండా మొత్తానికి పది రోజులుగా విద్యుత్ సర్వీస్ నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర ఎస్‌సి కాలనీ, కిష్టు తండాల్లో అంధకారం నెలకొంది. కొన్నేండ్లుగా విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదంటూ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దాంతో పది రోజులుగా వందలాది దళిత, గిరిజన కుటుంబాలు అంధకారంలోనే మగ్గుతున్నాయి. చిన్నవంగర సబ్‌స్టేషన్ పరిధిలో నష్టాలు వస్తున్నాయని విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మూడు నెలల కిందట చిన్నవంగర, కిష్టు తండాల్లో పర్యటించారు. కాలనీతో పాటు తండాల్లోని వందలాది ఇళ్లలో కరెంట్ మీటర్ లేవని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. పలు కుటుంబాలు విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో చిన్నవంగర ఎస్సీ కాలనీలో 48, కిష్టు తండాల్లో 14 కేసులు నమోదు చేసి, సుమారు రూ. మూడు లక్షలకుపైగా జరిమానాలు విధించారు. ఒక్కొక్కరు వేలల్లో బకాయిలు ఉండటంతో అధికారులు కాలనీ, తండా మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దాంతో బాధిత కుటుంబాలు కరెంట్ లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా తాము విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. వంద యూనిట్లలోపు కరెంట్‌ను వాడుకుంటున్న ఎస్‌సి, ఎస్‌టిలు బిల్లు ఎందుకు చెల్లించాలంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తమను విద్యుత్ అధికారులు మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.. రెక్కాడితే గాని డొక్కాడని మాకు అధికారులు మీటర్లు ఏర్పాటు చేసుకోవడానికి మరికొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

మీటర్ల ఏర్పాటుపై అవగాహన కల్పించాలి : ఈదురు రాజేశ్వరి, ఎంపిపి, పెద్దవంగర

హరిజన, గిరిజన వాడల్లో కరెంట్ మీటర్ల ఏర్పాటు కోసం విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. వారికి ప్రభుత్వం కల్పించే వంద యూనిట్ల వరకు ఉచితంపై అవగాహన లేక మీటర్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కిష్టు తండా, చిన్నవంగర ఎస్సీ కాలనీ వాసులకు కొంత సమయం వెసులుబాటు కల్పించాలి. సమస్యను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

దళితులను ప్రోత్సహిస్తున్నాం : - జలగం లక్ష్మి, సర్పంచ్, చిన్నవంగర

కాలనీలో నూతన మీటర్ల ఏర్పాటుకు దళిత, గిరిజనులను ప్రోత్సహిస్తున్నాం. గతంలో కరెంట్ బిల్లులు చెల్లించిన దాఖలు లేకపోవడంతో మీటర్ల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు. అయినా ప్రభుత్వ నిబంధనలను వారికి వివరిస్తూ, త్వరలోనే మీటర్ల ఏర్పాటుకు సహకరిస్తాం. వారం రోజులుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు : మధుసూదన్, విద్యుత్ డిఇఇ, తొర్రూరు

గ్రామాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఎస్‌సి, ఎస్‌టిలు నూతన కరెంట్ మీటర్ల ఏర్పాటు చేసుకోవాలి. డిడి కట్టిన వారం రోజుల్లో మీటర్లు ఏర్పాటు చేస్తాం. వారు కుల ధృవీకరణ పత్రం అందిస్తే, ప్రభుత్వం వంద యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా సరఫరా చేస్తుంది. ఎస్‌సి, ఎస్‌టిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సినీ రచయిత సత్యానంద్‌కు అదుర్తి ఆత్మీయ పురస్కారం

ప్రజాశక్తి - కల్చరల్

రవీంద్రభారతి సమావేశ మందిరంలో సినీ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నటి సావిత్రిల జయంతి, నటుడు కృష్ణ సంస్మరణ సభ జరిగింది. ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, సారిపల్లి కొండలరావు సహకారంతో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిధిగా దూర్దర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ మధుసూదన రావు పాల్గొన్నారు. ప్రముఖ సినీ రచయిత సత్యానంద్‌కు ఆదుర్తి ఆత్మీయ ప్రతిభా పురస్కారం బహుకరించి ఆయన మాట్లాడారు. సత్యానంద్ సంభాషణల రచనలో ప్రావీణ్యులన్నారు. నాటి నటులు ఎఎన్ఆర్, ఎన్‌టిఆర్ నుంచి నేటి నటులు పవన్ కల్యాణ్ వరకు వందల చిత్రాలకు మాటలు రాసి ఆ సినిమాల విజయానికి భాగస్వామి ఇచ్చారని వివరించారు. సౌజన్య దాత సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆదుర్తి, సావిత్రి ల మూగ మనసులు గొప్ప సినిమా అని, కృష్ణను చిత్ర రంగానికి పరిచయం చేసింది ఆదుర్తి అని గుర్తు చేశారు. వేదిక పై దర్శకుడు ఆదిత్య, రచయిత్రి పల్లవి, జర్నలిస్ట్ రమేష్ బాబు, సినీ రచయిత ఎస్‌వి రామారావు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ స్వాగతం పలుకగా భాగి శాస్త్రి వందన సమర్పణ చేశారు.

భారీ సెక్స్ రాకెట్‌ను ఛేదించిన

సైబరాబాద్ పోలీసులు

- 17 మంది ముఠా అరెస్ట్
- 39 కేసుల్లో నిందితులకు ప్రమేయం
- 1,419 మంది అమ్మాయిలను కాపాడిన పోలీసులు
- హ్యూమన్ ట్రాఫికింగ్‌లో అర్నావ్ కీలక నిందితుడు
- సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర

మీడియాతో మాట్లాడుతున్న సిపి స్టీఫెన్ రవీంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హ్యూమన్ ట్రాఫికింగ్ సెక్స్ రాకెట్ ముఠాను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మొత్తం 17 మందితో కూడిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సిపి కార్యాలయంలో సిపి స్టీఫెన్ రవీంద్ర మంగళవారం మీడియాకు వెల్లడించారు. 17 మందితో ముఠాగా ఏర్పడి దేశంలోని 15 సిటీల నుంచి యువతులను రప్పించి సెక్స్ రాకెట్స్ నడుపుతున్నారు. వెబ్‌సైట్, వాట్సాప్ గ్రూప్స్, కాల్ సెంటర్లు, యాడ్స్ ద్వారా కస్టమర్లను ఆకర్షించి, వారి వద్దకు అమ్మాయిలను పంపిస్తున్నారు. 39 కేసుల్లో ఈ నిందితులకు ప్రమేయం ఉంది. 1,419 మంది అమ్మాయిలు వ్యభిచార ముఠాలో చిక్కుకున్నట్టు గుర్తించారు. సెక్స్ రాకెట్స్‌తో పాటు డ్రగ్స్‌నూ సప్లై చేస్తూ కస్టమర్లకు ఎర వేస్తున్నారు. ఇప్పటికే సైబరాబాద్‌లో ఐదు కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్టు సిపి తెలిపారు. సరఫరాదారులు, బ్రోకర్ల ద్వారా బాధిత మహిళలను కస్టమర్ల దగ్గరకు పంపుతున్నారని చెప్పారు. విమానాల్లోనూ అమ్మాయిలను ఇతర రాష్ట్రాల కస్టమర్ల దగ్గరకు పంపుతున్నట్టు విచారణలో వెల్లడైంది. ఎపి, తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ, ముంబై, కోల్‌కతకు చెందిన వారు బాధితులుగా ఉన్నారని, బంగ్లాదేశ్, నేపాల్, రష్యాకు చెందిన అమ్మాయిలూ ఉన్నారని తెలిపారు.

"వ్యభిచారం ద్వారా వచ్చిన డబ్బులో 30 శాతం బాధిత యువతులకు, 35 శాతం యాడ్స్, వెబ్ సైట్స్‌కు మిగతా 35 శాతం నిర్వాహకులు తీసుకుంటారు. దీనికి అర్నావ్ అనే వ్యక్తి కీలక నిందితుడు. 915 మంది అమ్మాయిలను ముంబై, కోల్‌కత నుంచి తీసుకొచ్చాడు. 2019 నుంచి సమీర్ అనే వ్యక్తి 850 మంది అమ్మాయిలను సరఫరా చేశాడు. ఎపిలోని అనంతపురం, తెలంగాణలోని కరీంనగర్ నుంచి సెక్స్ రాకెట్ నడుపుతున్నారు. సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్‌లో అర్నావ్ డ్రగ్స్, వ్యభిచార దందా నిర్వహిస్తున్నాడు. 950 మంది అమ్మాయిలతో హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్ నడుపుతున్నాడు. సోమాజిగూడలో కీలక నిందితుడు అర్నావ్‌ను అరెస్ట్ చేశాము" అని సిపి స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. అర్నావ్ ఉంటున్న ఇంట్లోనే ఎండిఎంఎ డ్రగ్స్‌ను సీజ్ చేశామన్నారు. సెక్స్ రాకెట్ ముఠా సభ్యులు వివిధ గ్రూపులుగా విడిపోయి దందా చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో కొన్ని హోటల్స్‌లో పని చేసే వాళ్ల ప్రమేయం ఉందని, వారినీ అరెస్ట్ చేశామన్నారు. ఉద్యోగాలు లేని అమ్మాయిలను, పేదరికంలో ఉన్న యువతులను జాబ్స్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నారని తమ విచారణలో వెల్లడైందని సిపి వెల్లడించారు.

ప్రముఖ హోటల్ మేనేజర్ అరెస్ట్

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న రాడిసన్ హోటల్ మేనేజర్ రాకేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గచ్చిబౌలిలోని హోటల్స్‌తో పాటు అత్యంత పేరు పొందిన ఇతర హోటల్స్‌లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం నమ్మశక్యం కానీ విషయం. ఇదంతా మేనేజర్‌కు తెలిసి జరిగిందా లేక తెలియక జరిగిందా అనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కేసుపై పూర్తి విచారణ చేపడుతామని సిపి తెలిపారు. ఈ కేసును చేదించిన స్పెషల్ ఆఫీసర్, డిసిపి కవిత, ఆమె టీంను సిపి అభినందించారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాతే ఎల్‌బి నగర్ - హయత్‌నగర్ మెట్రో

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మొదటి దశలో చేపట్టిన ఎల్‌బీనగర్, నాగోల్ వేర్వేరు మార్గాల మెట్రో రూట్లను కలుపుతూ నాగోల్ నుంచి ఎల్‌బి నగర్ వరకు మిగిలిపోయిన ఐదు కి.మీ మెట్రోను రెండో దశలో చేపడతామని, ఎల్‌బి నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రోను ఎన్నికల తర్వాత విస్తరిస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ తెలిపారు. రాష్ట్రంలో సమతుల్యమైన అభివృద్ధి, సంక్షేమం జోడి ఎద్దుల మాదిరిగా అమలు చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లోనూ గెలుస్తుందని, మరోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ. 55 కోట్ల విలువగల పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి కొత్త నమూనాను దేశం ముందు ఆవిష్కరిస్తూ పట్టణ, పల్లె అభివృద్ధి, పరిశ్రమలు-పర్యావరణం, వ్యవసాయం, ఐటీ సమతుల్యమైన కొత్త ఇంటిగ్రేటెడ్ హెలిస్టిక్ మోడల్‌ను సిఎం కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఎస్ఎన్‌డిపి పథకం కింద జిహెచ్ఎంసి పరిధిలో రూ. 985 కోట్లతో 56 పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. అందులో జిహెచ్ఎంసి రూ. 724 కోట్లతో 34 పనులను చేపట్టిందని, ఇప్పటి వరకు రెండు పనులు పికెట్ నాలాపై బ్రిడ్జి, బండ్లగూడ చెరువు నుంచి నాగోల్ చెరువు వరకు నాలా పనులు పూర్తి చేశామని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి 17 పనులు పూర్తి చేస్తామన్నారు. మరో 15 పనులు జనవరి వరకు పూర్తి చేస్తామని తెలిపారు. హుస్సేన్ సాగర్ సర్ఫేస్ నాలా, బల్కాపూర్ నాలా ఎండాకాలం వరకు పూర్తి చేస్తామని చెప్పారు. జిహెచ్ఎంసి చుట్టుపక్కల మున్సిపాలిటీల్లో రూ. 240 కోట్లతో 21 పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. తెలంగాణ వచ్చిన సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.24 లక్షలని, తెలంగాణ వచ్చిన ఏడేండ్లలో రూ. 2.78 లక్షల తలసరి ఆదాయంతో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని గర్వంగా చెప్పవచ్చన్నారు. జిఎస్‌డిపి తెలంగాణ వచ్చిన సమయంలో రూ.5.6 లక్షల కోట్లని, ఈ రోజు రూ.11.55 లక్షల కోట్లు ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపి రాములు, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, సురభి వాణిదేవి, బుగ్గారపు యోగానాథ్, శంబీపూర్‌రాజు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పురాస్కర ప్రదానోత్సవంలో ప్రముఖులు

రఫీ, ఘంటసాల పాటలతో మానసిక ఊరట

ప్రజాశక్తి - కల్చరల్

మానసిక ఒత్తిడి ని దూరం చేసి ఊరట చేకూర్చేది రఫీ, ఘంటసాల పాటలని రాష్ట్ర హోం శాఖా మంత్రి మహమూద్ అలీ అన్నారు .ఘంటసాల వంటి మహనీయులను సమాజం విస్మరించాదని ఆయన చెప్పారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభ్యుదయ కళా సేవా సమితి, శృతి లయ ఆర్ట్స్ అకాడెమీ నిర్వహణలో ఘంటసాల శత జయంతి సందర్భంగా ఆయన పేరిట పురాస్కర ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిధిగా మహమూద్ అలీ పాల్గొని పురస్కరాలు బహుకరించి మాట్లాడారు. పురస్కర గ్రహీతలు పై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. అధ్యక్షత వహించిన శాసనమండలి సభ్యుడు ఎస్ మధుసూదనాచారి మాట్లాడుతూ ఘంటసాల మూడు తరాలుగా ప్రజలను తన పాటలతో రంజింప చెందుతున్నారని కొనియాడారు. ఘంటసాల కోడలు కృష్ణ కుమారి మాట్లాడుతూ మామామగారికి కుల మత బేధభావాలు లేవని చర్చి ప్రారంభించినా, విఖ్యాత సంగీత పండితుడు బడే గులాంను గురువుగా భావించిన ఆయన సమతాభవం చూపరన్నారు ఆయనకు భారత రత్న పురస్కారం ఇవ్వాలని కోరారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, తిరుమల గ్రూప్ చంద్రశేఖర్, బీమ్ రెడ్డి ,రఫీ తదితరులు సభలో పాల్గొన్నారు. అమని నిర్వహణలో గాయనీగాయకులు పలు గీతాలు మధురంగా అలపించారు.

తెలంగాణపై ఎందుకీ వివక్ష

- విభజన హామీలు, పెండింగ్ నిధులపై సమగ్రంగా చర్చించాలి
- కేంద్రం ఆంక్షలతో రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల నష్టం
- లోక్‌సభ టిఆర్ఎస్ పక్షనేత నామ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సమగ్ర చర్చించి రాష్ట్రానికి న్యాయం చేయాలని లోక్‌సభ టిఆర్ఎస్ పక్షనేత నామ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి జరగనున్న శీతాకాల సమావేశాలను పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలో స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో నామ మాట్లాడారు. రాష్ట్రానికి సంబంధించి ఎంతో కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని విభజన అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఇంతవరకు ఏ ఒక్కటీ కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీసేలా కేంద్రం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీస్తున్నదని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏ ఒక్క విభజన హామీ అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఎందుకీ వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్శిటీ, ఐఐఎం స్థాపన తదితర హామీలు ఏమయ్యాయని నిలదీశారు. వీటన్నింటిపై పార్లమెంటు సమావేశాల్లోనే చర్చించి, తెలంగాణకు న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయడంలేదని చెప్పారు. రుణాలు పొందే విషయంలో కూడా లేనిపోని ఆంక్షలు విధించి, వివక్షతే చూపిస్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయనీ, ఇందుకు సంబంధించి ప్రత్యేక చర్చించాలని కోరారు. రైతులు సమస్యలు, విద్యుత్ సంస్కరణలు, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, నిరుద్యోగం, కులగణన, రిజర్వేషన్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కొర్రీలతో తెలంగాణ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రానికి రూ.40 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అన్ని అంశాలపై చర్చించి, తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కేంద్రాన్ని కోరారు.

కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి పదెకరాల కేటాయింపు

- సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి పదెకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. ఈ విషయంపై సిఎం కెసిఆర్‌కు రాష్ట్రమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు స్థాయిలో పెద్ద కోర్టు భవనాన్ని ఏర్పాటు చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామనీ, భూమి పూజ చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ప్రస్తుత కోర్టు కాంప్లెక్స్‌లో సరైన వసతుల్లేక కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహిరంగసభలో సిఎం కెసిఆర్ దృష్టికి మంత్రి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో మహబూబ్‌నగర్‌లో అధునాతన కోర్టు భవనాన్ని నిర్మించేందుకుగానూ సిఎం హామీనిచ్చారు. అందులో భాగంగానే బండమీడిపల్లిలోని పశుసంవర్ధక శాఖకు చెందిన పదెకరాలను న్యాయశాఖకు అప్పగిస్తూ మంగళవారం జిఒ నంబర్ 141ని విడుదల చేసింది.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బిజెపి

- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విస్మరిస్తూ పాలన కొనసాగిస్తున్నదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. రాజ్యాంగ హక్కులను పూర్తిగా కాలరాస్తున్నదని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాటాలకు విద్యార్థి లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్రను మోడీ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. అందులో భాగమే నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చిందని వివరించారు. విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని అన్నారు. దీనివల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యాపారీకరణ వల్ల ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మైనార్టీలు విద్యకు దూరమవుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను గాలికి వదిలేశాయని విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు రెహమాన్, బరిగల వెంకటేష్, గ్యార క్రాంతి, బాలసాని లెనిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి సంతోష్, అన్వర్, అంజి, ప్రేమ్, కేశవ్, పవన్ చౌహాన్, గణేష్, రవితేజ, క్రాంతిరాజ్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 16గంటల పని

- సినిమా థియేటర్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశ్

మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినిమా థియేటర్లలోని కార్మికులతో రోజుకు 16గంటల పాటు పనిచేయిస్తూ యాజమాన్యాలు వారితో వెట్టి చేయిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతజేసినా వారికి కనీస వేతనాలు అమలు కావటం లేదని వాపోయారు. ఈ అంశంపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్న యజమాన్యాలకు మద్దతుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కావటం లేదన్నారు. ప్రభుత్వాధికారులు, థియేటర్ యజమానులు కుమ్మక్కై కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని తెలిపారు. ఎనిమిది గంటల పని విధానాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పనికి తగ్గ వేతనం ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. రోజు రోజుకు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.. కార్మికుల జీతాలు అందుకు తగ్గట్టుగా పెరగటం లేదని చెప్పారు. ఎక్కువ మందికి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు కావటం లేదన్నారు. ఈ సమస్యలు, డిమాండ్లన్నింటిపై పోరాడాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటి ఎన్నిక..

అధ్యక్షులుగా ఎన్ మారన్న, ప్రధాన కార్యదర్శిగా కె అరుణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె రాము (మహబూబ్ నగర్), ఎన్ రామస్వామి (హైదరాబాద్), వైస్ ప్రెసిడెంట్ జే.సుధాకర్ (రంగారెడ్డి), పి.మనోహర్ రెడ్డి (హైదరాబాద్ సౌత్), ఆర్.నరేష్ (మహబూబాబాద్), జె.ప్రభాకర్ (హైదరాబాద్ సెంట్రల్), చంద్రశేఖర్ (పీవీఆర్), సహాయ కార్యదర్శి వి.కమలాకర్ (మల్కాజిగిరి మేడ్చల్), కె సతీష్ (రంగారెడ్డి), సారయ్య (వరంగల్ అర్బన్), శ్రీనివాస్‌గౌడ్ (నిజామాబాద్), రాజు(సిద్ధిపేట్), శ్రీనివాస్ రెడ్డి, గీత, కోశాధికారి వీరనారాయణ (హైదరాబాద్), సహాయ కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటి సభ్యులుగా మరో పది మందిని ఎన్నుకున్నారు.

వారణాసిలో కాంటాక్ట్‌లెస్ బోర్డింగ్

డిజియాత్రను ప్రారంభించిన ఎన్ఇసి

న్యూఢిల్లీ : దేశంలోని విమానాశ్రయాలలో బోర్డింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన ఫేసియల్ రికగ్నిషన్, బయోమెట్రిక్ సొల్యూషన్స్‌ను అందించే ఎన్ఇసి ఇండియా కొత్తగా డిజియాత్రను రూపొందించినట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే ఇటీవల వారణాసి ఎయిర్‌పోర్టులో ఫేసియల్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టి), బయోమెట్రిక్ టెక్నాలజీ ద్వారా ప్రయాణీకుల కాంటాక్ట్‌లెస్ బోర్డింగ్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. డిజియాత్ర సౌలభ్యాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వర్చువల్‌గా ప్రారంభించారని పేర్కొంది. ఈ కాంటాక్ట్‌లెస్ బోర్డింగ్ సేవలను పొందేందుకు ప్రయాణీకులు తమ వివరాలను ముందుగా డిజియాత్ర యాప్‌లో వన్-టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. డిజియాత్రను నిర్వహించేందుకు వారణాసి, కోల్‌కతా, పూణె, విజయవాడ లాంటి నాలుగు వేర్వేరు విమానాశ్రయాలలో దీన్ని అమలు చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) నుండి 2019 ముగింపులో ఎన్ఇసి కాంట్రాక్టును సాధించినట్లు గుర్తు చేసింది.

9న 5,500 రక్తదాన శిబిరాలు

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : డిసెంబర్ 9న దేశ వ్యాప్తంగా 1,150 నగరాల్లో 5,500 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా 2007 నుంచి నిర్వహిస్తున్న క్యాంపెయిన్‌లో ఇది 14వ రక్తదాన శిబిరమని పేర్కొంది. ఇందులో పెద్ద కార్పొరేట్ సంస్థలు, కళాశాలలు, బ్యాంకు శాఖల ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొంది. ఈ దఫా శిబిరంలో 4.5 లక్షల మంది రక్తదాతలు పాల్గొనే అవకాశాలున్నాయని ఆ బ్యాంక్ అంచనా వేసింది.

కేటుగాళ్ల స్పామ్‌కాల్స్‌కు ట్రూకాలర్ చెక్

న్యూఢిల్లీ : కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్ మరో విశేష ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. దీని సాయంతో తాము ప్రభుత్వ అధికారులమని, మంత్రి, ఎంఎల్ఎలమని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేసే కేటుగాళ్లను సులభంగా గుర్తించవచ్చని పేర్కొంది. సంస్థ ఆవిష్కరించిన ఈ ప్రభుత్వ డిజిటల్ డైరెక్టరీ ఫీచర్‌తో ప్రభుత్వానికి సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లను సులభంగా గుర్తించవచ్చని ట్రూకాలర్ తెలిపింది. తమ గవర్నమెంట్ డిజిటల్ డైరెక్టరీ ఫీచర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల ఫోన్ నెంబర్లు ఉన్నాయని తెలిపింది. వినియోగదారులు తమ ఫోన్లలో ట్రూకాలర్ యాప్‌ను అప్‌డేట్ చేసి ఈ కొత్త ఫీచర్‌ను పొందవచ్చని తెలిపింది.

AJOONI BIOTECH

నేటి నుంచి అజుని బయోటెక్ రైట్ ఇష్యూ

ముంబయి : జంతువుల హెల్త్‌కేర్ సొల్యూషన్స్, ఫీడ్ సంస్థ అజుని బయోటెక్ లిమిటెడ్ డిసెంబర్ 7 నుంచి రైట్ ఇష్యూను తెరుస్తున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా రూ.29.01 కోట్ల నిధులను సమీకరించాలని నిర్దేశించుకున్నట్లు మంగళవారం ఆ సంస్థ తెలిపింది. ఈ నిధులతో మూలధన అవసరాలను తీర్చుకోనున్నట్లు వెల్లడించింది. ఈ ఇష్యూలో రూ.6 చొప్పున షేర్లను జారీ చేయనున్నట్లు తెలిపింది. డిసెంబర్ 6తో ముగిసిన షేర్ విలువతో పోల్చితే 30 శాతం తగ్గింపును ఇస్తున్నట్లు పేర్కొంది. డిసెంబర్ 15న ఈ ఇష్యూను మూసివేయనున్నట్లు తెలిపింది.

1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు.

పల్లా పదవి మరో రెండేండ్లు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదవిని ప్రభుత్వం మరో రెండేండ్లకు పొడిగించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ, సహకార శాఖలు వెంటనే ప్రభుత్వ ఆదేశాలను అమల్లోకి తీసుకరావాలని ఆదేశించారు. పలువురు నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు.

దేశవ్యాప్తంగా దళిత బంధు అమలు చేయాలి : పిడమర్తి రవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా దళిత బంధు అమలు చేయాలని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి నిజమైన దేశాభివృద్ధి అని భావించి రాష్ట్రంలో సిఎం కెసిఆర్ దళిత బంధును ప్రవేశపెట్టారని చెప్పారు. ,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోనూ ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, రాజ్యాంగ స్ఫూర్తిని, దళిత, బహుజన ఆత్మగౌరవాన్ని కాపాడారన్నారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు డాక్టర్ యాలాద్రి, మాదిగ జెఎసి ఉపాధ్యక్షులు పాతకోటి కరణ్, బిఎస్ఎఫ్ ఒయు అధ్యక్షులు బోరెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు మార్గదర్శి నార్ల

స్మారకోపన్యాసంలో టంకశాల అశోక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని తరాల పాత్రికేయులకు మార్గదర్శి నార్ల వెంకటేశ్వరరావు అని సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్ అన్నారు. సమాజాన్ని కులమతాల పేరుతో విభజించడం భావ్యం కాదనీ, పాత్రికేయులుగా గొప్ప విలువలతో నార్ల జీవించారని చెప్పారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నార్ల జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టంకశాల అశోక్ స్మారకోపన్యాసం చేశారు. నార్ల పట్టుదల, విలువలతో కూడిన పాత్రికేయులుగా జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచారని వివరించారు. మూడు పదుల వయస్సులోనే ఆయన అంతర్జాతీయ పరిణామాలపైన వ్యాసాలు, పుస్తకాలు రాశారని గుర్తు చేశారు. ఆయన ఏ అంశంపైన వ్యాసం రాయాలన్నా, పుస్తకం ప్రచురించాలన్నా చాలా పరిశోధన చేసేవారని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువ జర్నలిస్ట్‌లలో విషయ పరిజ్ఞానం కోసం, లోతుగా అధ్యయనం చేయడం లోపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి జర్నలిస్ట్‌గా గుర్తింపు రావాలంటే సమాజంలో ఉన్న సమస్యలను పారదోలడానికి పనిచేయాల్సిన అవసరముందని సూచించారు. అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె సీతారామారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో నార్లలాంటి పాత్రికేయులు సమాజానికి చాలా అవసరమన్నారు. విలువలతో కూడిన పాత్రికేయం ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. ఆయన రాసిన, సేకరించిన పుస్తకాలను అంబేద్కర్ వర్సిటీ లైబ్రరీకి అందించడం గర్వకారణంగా ఉందన్నారు. వాటిని త్వరలోనే డిజిటలైజ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థికి కరాటేలో బంగారు పతకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బంగారు పతకాలు తయారయ్యేది బంగారంతోనే కాదు, నిరంతర కృషితో, పట్టుదలతోనూ తయారవుతాయి" అన్న నానుడిని ఆచరణలో నిరూపించాడు ఓ విద్యార్థి. తమిళనాడు రాష్ట్రం, సేలంలోని శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థి యశ్వంత్, నవంబర్ 2022లో శ్రీలంకలో జరిగిన సౌత్ ఆసియన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో అండర్ 6 క్యాడెట్ జూనియర్ కేటగిరీలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. ఈ పోటీల్లో పాల్గొన్న మిగిలిన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, భూటాన్‌ల నుండి వచ్చిన పోటీదారులను అధిగమించి ఈ పతకాన్ని సాధించాడు. శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. తమ స్కూల్‌లోని పిల్లలు అకాడెమిక్స్‌లో మాత్రమేగాక, క్రీడల్లోనూ, ఇతర రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. బంగారు పతకం సాధించిన విద్యార్థి యశ్వంత్‌ను, అతని తల్లిదండ్రులను శ్రీ చైతన్య వ్యవస్థాపక చైర్మెన్ డా బిఎస్ రావు ఘనంగా సన్మానించి, అభినందించారు.

అంబేద్కర్ వ్యక్తికాదు... ఓ వ్యవస్థ : మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్యక్తికాదు... ఓ వ్యవస్థ అని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ కల్పించిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలు చేస్తోందని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

ఖర్గేతో మహేష్‌కుమార్ భేటీ

ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేను పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితులను ఈ సందర్భంగా వివరించారు.